న్యూస్‌రీల్

పాత సిలబస్‌లోనే పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): పాత సిలబస్ ప్రకారమే ఫెయిల్ అయిన పదో తరగతి రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని డీఈఓ సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021-22, 2023-24 విద్యా సంవత్సరాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు, మాల్ ప్రాక్టీస్ విద్యార్థులకు పాత సిలబస్ ప్రకారమే పరీక్షలు ఉంటాయన్నారు. అలాగే 2024-25 ఏడాదిలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు కొత్త సిలబస్ ప్రకారమే పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మార్చి 2025లో అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయని డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ విజయవాడ ద్వారా ఉత్తర్వులు అందాయన్నారు.

సంక్షేమ రాజ్యస్థాపనే లక్ష్యం



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): దేశంలో సంక్షేమ రాజ్యాన్ని స్థాపించడమే తమ లక్ష్యమని, ఇందు కోసం ఈనెల 14 వరకు ప్రచార ఉద్యమాలను చేపట్టామని వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా నంద్యాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ అన్సర్‌బాషా అన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ప్రచార ఉద్యమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కుల, మత, జాతి విద్వేశాలు పెరిగిపోయాయన్నారు. ఎన్నికల కమిషన్ చేత ఈవీఎంల ద్వారా కార్పొరేట్లకు అధికారం కట్టబెట్టేదిగా మారిందన్నారు. కార్యక్రమంలో నాయకులు సలీమ్, యూనిస్, కాశీం, రషీద్, జునైద్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



రాజా, ఎంఆర్ నాయక్

నంద్యాల(న్యూటౌన్): ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.స్థానిక కార్యాలయంలో శుక్రవారం జరిగిన జిల్లా నాల్గవ ప్లీనరీ సమావేశంలో మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన ఈ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రాజా, ప్రధాన కార్యదర్శిగా ఎంఆర్‌నాయక్, ఉపాధ్యక్షులుగా దినేష్,అశోక్, చిన్న హుసేన్, సహాయ కార్యదర్శులుగా ప్రశాంత్, హర్ష, హరివర్ధన్, కో ఆప్షన్ మెంబర్లుగా కిశోర్, విజయ్, ఫైజుల్లా, సైఫుల్లా, చరణ్, సాయి, శ్రీరామ్, మాబాషా, ఈశ్వర్‌ల తో పాటు 21 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజా, ఎంఆర్ నాయక్ మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తామన్నారు.

పాటల పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): తెలుగు క్రైస్తవ సంగీత కళాకారుల మహాసభ ఆధ్వర్యంలో పట్టణంలోని హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి ఆవరణలో శుక్రవారం పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు నిర్వహించారు. తెలుగు క్రైస్తవ తొలి పద కవిత పితామహుడు పురుషోత్తమ చౌదరి రచించిన ఆంధ్రక్రైస్తవ కీర్తన పాటల పోటీల్లో పలువురు ప్రతిభ చాటారు. మొదటి ముగ్గురు విజేతలకు వరుసగా రూ. 5 వేలు, రూ. 3 వేలు, రూ. 2 వేలు అందజేశారు.కన్సోలేషన్ బహుమతులుగా ఒక్కొక్కరికీ రూ.1000 అందజేశారు. తెలుగు క్రైస్తవ సంగీత కళాకారుల మహాసభ కన్వీనర్ అబ్రహం మాట్లాడుతూ కీర్తి శేషులు పురుషోత్తమ చౌదరి 222వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.కార్యక్రమానికి పాస్టరేట్-3 డీనరీ చైర్మన్ నందం ఐజక్ బాబు దైవసందేశాన్ని అందించారు. కార్యక్రమంలో మనోజ్‌కుమారు, కారు రవికుమార్, కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరి అంధులకు చూపు



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

ఉయ్యాలవాడ: నేత్రదానం చేయడం ద్వారా మరో ఇద్దరు అంధులకు చూపు ఇచ్చినవారవుతారని కంటివైద్యులు రమేష్, పీహెచ్‌సీ డాక్టర్ అపర్ణ అన్నారు. శుక్రవారం ఉయ్యావాడలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్రదానంపై స్థానికులకు కరపత్రాలు పంచి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ దస్తరి, పీహెచ్‌ఎన్ లక్ష్మీదేవి, ఆరోగ్యకార్తకర్త ఉమామహేశ్వరి, ఆశావర్కర్లు సుజాత, లక్ష్మి, వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



పసురపాడులో గణేష్ మండపాన్ని ఏర్పాటు చేస్తున్న యువకులు,



నంద్యాలలో మట్టి విగ్రహాలను కొనుగోలు చేస్తున్న భక్తులు



చిట్టి వినాయకులను అమ్మకానికి ఉంచిన దృశ్యం



క్రేన్ సహాయంతో విగ్రహాలను ట్రాక్టర్‌లోకి చేర్చుతున్న దృశ్యం

రావయ్యా.. గణపయ్యా

- అంతటా వినాయక చవితి సందడి
- ఏర్పాట్లలో నిర్వాహకులు బిజీబిజీ
- మండపాలకు విగ్రహాలను తరలించిన నిర్వాహకులు
- మట్టి ప్రతిమల కొనుగోలుకు భక్తుల ఆసక్తి

గోస్పాడు: పల్లె, పట్టణం అనే తేడా లేకుండా అంతటా వినాయక చవితి పండగ సందడి నెలకొంది. పూజా సామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్ కిటకిటలాడుతోంది. విగ్రహాల కొనుగోలు కేంద్రం నుంచి వివిధ ప్రాంతాలకు విగ్రహాలను తరలిస్తున్నారు. ప్రతి కూడలి, వీధుల్లో గణేష్ ఉత్సవ మంటపాల ఏర్పాట్లలో యువకులు నిమగ్నమై కనిపించారు. పండుగను వైభవంగా నిర్వహించేందుకు భక్తకోటి సర్వం సిద్ధం చేసుకుని రావయ్యా.. గణపయ్యా అంటూ స్వాగతం పలుకుతున్నారు. వేడుక నిర్వహణలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని, కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

విద్యుద్దీపాలతో జాగ్రత్త....

గణేష్ మంటపంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు, వేలాడే విద్యుత్ తోరణాలతో ప్రమాదం పొంచి ఉంటుంది. భక్తులు పొరపాటున విద్యుత్ వైర్లను తాకితే విద్యుదాఘాతానికి గురయ్యే సందర్భాలూ లేకపోలేదు. కట్ చేసిన విద్యుత్ వైర్లను కలపడం, పిన్నీసతో గుచ్చడం చేస్తుంటారు. ప్రమాదకరమైన ఇటువంటి చోట్ల తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. తడి కాళ్లు, చేతులతో చిన్నారులు విద్యుత్ తీగలను తాకకుండా చూసుకోవాలి. తలకు తగలకుండా విద్యుత్ తోరణాలను ఎత్తుగా కట్టాలి.



నంద్యాలలో విగ్రహాలను కొనుగోలు చేస్తున్న యువకులు



టెక్కె మార్కెట్‌యార్డులో పూజా సామగ్రినికి కొనుగోలు చేస్తున్న భక్తులు

బాధ్యత కమిటీలదే..

వినాయక మంటపాలు ఏర్పాటు వద్ద భద్రత కూడా కీలకమే. పండగ సందర్భంగా యువకుల మధ్య వివాదాలు ప్రేరేపించడానికి కొందరు ఆకతాయిలు ప్రయత్నిస్తుంటారు. ఈ క్రమంలో వినాయక ఉత్సవాలు స్నేహపూర్వకంగా చేసుకునేలా కమిటీ నిర్వాహకులు స్థానిక యువకులకు ప్రాధాన్యం కల్పించాలి. రాత్రి సమయాల్లో మంటపాల వద్ద కొందరు కాపలా ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

నిబంధనలు తప్పనిసరి

- విగ్రహ ఏర్పాటుకు కమిటీలు తప్పనిసరిగా ముందస్తు పోలీసుల అనుమతులు పొందాలి.
- వివాదాస్పద స్థలాలు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ప్రాంతాల్లో మంటపాలు ఏర్పాటు చేయరాదు.
- మంటపాల వద్ద ఏర్పాటు చేసే సౌండ్ బాక్సులు, మైక్‌సెట్లకు అనుమతులు తప్పనిసరి. మితిమీరిన సౌండ్ నిషిద్ధం.
- ఉత్సవాల్లో అశ్లీల నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేయరాదు. మత్తు పానీయాలు సేవించరాదు.
- విద్యుత్ శాఖాధికారుల అనుమతులతో తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు శాఖాపరమైన అధికారుల పర్యవేక్షణలో ఏర్పాటు చేయాలి. విద్యుత్ చౌర్యానికి పాల్పడరాదు.
- ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ఉత్సవ కమిటీ సభ్యులే బాధ్యత వహించాల్సి ఉంటుంది.
- రాత్రి 10 గంటల తర్వాత మంటపాల వద్ద కార్యక్రమాలను నిలిపివేయాలి.
- విగ్రహాల నిమజ్జన సమయంలో తగు నిబంధనలు పాటించాలి.

శాంతియుతంగా పండగను నిర్వహించుకోండి

చాగలమర్రి: మండలంలో వినాయక చవితి పండుగను శాంతియుత వాతావారణంలో నిర్వహించుకోవాలని చాగలమర్రి ఇన్‌చార్జ్ ఎస్ఐ హరిప్రసాద్ ప్రజలకు సూచించారు. సమస్యాత్మక గ్రామాలైన చిన్నవంగలి, తోడేండ్లపల్లె, గొడిగనూరు గ్రామాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో మండపాలను, అలాగే విగ్రహాలను నిమజ్జనం చేసే కేసీ కాలువను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లో గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించి గ్రామాల్లో పార్టీలకు అతీతంగా అందరూ పండుగను సంతోషంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు 70 విగ్రహాలను ఏర్పాటుకు దరఖాస్తు చేశారన్నారు. కార్యక్రమంలో చిన్నవంగలికి చెందిన ఎంపీటీసీ లక్ష్మీరెడ్డి, నర్సిరెడ్డి, సంజీవరెడ్డి, గురుశేఖర్ రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన నేతలు

కర్నూలు (టౌన్): నంద్యాల, కర్నూలు జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు అని వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలందరికీ వినాయకుడి శుభాలు కలగాలని ఆకాంక్షించారు. మూడేళ్ల పాటు బక్రీదు, వినాయకచవితి పండుగలు ఒకేసారి వచ్చినా ప్రజలందరూ మతసామరస్యం పాటిస్తూ శాంతియుత వాతవరణంలో వేడుకలు జరుపుకున్నారని గుర్తు చేశారు. జిల్లాకు మంచి సంప్రదాయం ఉందని, 9 రోజులు వినాయకుడికి ఘనంగా పూజలు నిర్వహించి కులాలకు, మతాలకు అతీతంగా ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పండుగను ఆనందంగా జరుపుకోండి

నంద్యాల(అర్బన్): వినాయక చవితి పండగను జిల్లా ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందంగా జరుపుకోవాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాలు శుక్రవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కూడా ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

వినాయక చవితి సంబరాలు షురూ

రుద్రవరం: మండలంలో శుక్రవారం వినాయక చవితి సంబరాలు మొదలయ్యాయి. పట్టణాల్లో గణనాధుల విగ్రహలను కొనుగోలు చేసి ట్రాక్టర్లు, ఆటోల్లో గ్రామాలకు తీసుకెళ్తున్నారు. ఆయా గ్రామాలకు విగ్రహలు చేరుకోగానే యువత సంబరాలు చేసుకుంటూ వెళ్తున్నారు. ఇప్పటి వరకు మండలంలోని 21 గ్రామ పంచాయతీల నుంచి 50 విగ్రహలు కొలువు దీర్చేందుకు అనుమతులు తీసుకున్నారని పోలీసులు తెలిపారు.

డోర్నిపాడు: వినాయక చవితి సందర్భంగా గణనాథులు పల్లెకు చేరుకుంటున్నారు. హాయ్ భక్తులారా.. మిమ్మల్ని కలుసుకోవడానికి ఏడాదిగా ఎదురు చూస్తున్నాంటూ... ఆయా మండపాల్లో కొలువుదీరేందుకు సిద్ధమవుతున్నారు. శనివారం పూజలతో స్వామివారు భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇప్పటి వరకు 32 విగ్రహాలకు అనుమతులు తీసుకున్నారని ఏఎస్ఐ ప్రతాప్‌రెడ్డి శుక్రవారం తెలిపారు.



రుద్రవరంలో విగ్రహాన్ని ట్రాక్టరులో మండపం వద్దకు తీసుకెళ్తున్న దృశ్యం

మట్టి ప్రతిమలతో పర్యావరణానికి మేలు

నంద్యాల(న్యూటౌన్): మట్టి వినాయక ప్రతిమలు నెలకొల్పి నిమజ్జనం చేయడంతో పర్యావరణానికి ఎంతో మేలు అని నంద్యాల వన్‌టౌన్ ఎస్ఐ సుధాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక బాలా అకాడమీ పాఠశాల ఆధ్వర్యంలో ఆత్మకూరు బస్టాండ్, లక్ష్మిగణపతి గుడి ఆవరణలో సుమారు మట్టి గణనాథులను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ మాధవీలత, పల్లె వెంకటసుబ్బయ్య, రవీంద్రనాథ్, ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల(వ్యవసాయం): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం లయన్స్‌క్లబ్, సేవా భారతి ఆధ్వర్యంలో ఇంటింటికి మట్టి వినాయకులు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్, సిరిగి రమేష్‌ల ఆధ్వర్యంలో మట్టి వినాయకులను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, సందీప్, రమేష్, తదితరులు పాల్గొన్నారు. సేవా భారతి ఆధ్వర్యంలో ప్రసాద్, వాసుల సహకారంతో స్థానిక బైటిపేటలో 150 మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. సీనియర్ న్యాయవాది వెదుర్ల రామచంద్రారావు ఆధ్వర్యంలో టెక్కె నాగులకట్ట వద్ద భక్తులకు మట్టి వినాయకులను పంపిణీ చేశారు.



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న దృశ్యం



లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న దృశ్యం

వరద బాధితులకు అండగా నిలుస్తాం

నంద్యాల(న్యూటౌన్): వరద బాధితులకు సీపీఐ అండగా నిలుస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడులు అన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలో నిత్యావసర వస్తువులు, దుస్తులు, సహాయ నిధిని సేకరించారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వస్తువులు సేకరించి రాష్ట్ర పార్టీ కార్యాలయానికి అందజేయాలన్నారు. అక్కడ నుంచి సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో వరద బాధితులకు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, సోమన్న, భార్గవ్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితులకు దుస్తులు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

ఫొటో అప్‌లోడ్ బాధ్యతలు తప్పించండి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంటు

రుద్రవరం: ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల శుభ్రతపై ఫొటోలు అప్‌లోడ్ చేయాలనే బాధ్యతల నుంచి తమను తప్పించాలని సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు శుక్రవారం ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎంపీడీఓతో మాట్లాడుతూ కొన్ని సచివాలయాల పరిధిలో పాఠశాలలు దాదాపు ఐదారు కి.మీ దూరంలో ఉన్నాయని, అలాగే ఒక్కో సచివాలయం పరిధిలో ఐదు పాఠశాలలు ఉన్నాయని వాటి ఫొటోల అప్‌లోడ్ కష్టంగా మారుతుందన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓను ఉపసంహరించుకోవాలని కోరారు.

వరద సహాయక చర్యల్లో నంద్యాల మున్సిపల్ సిబ్బంది

నంద్యాల(సిటీ): విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రక్షణ సహాయక చర్యల్లో నంద్యాల మున్సిపల్ అధికారులు, సిబ్బంది సుమారుగా 110 మందికి పైగా పాల్గొన్నట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం విజయవాడలో పలు ప్రాంతాలలో పారిశుధ్య పనులు చేపట్టి నంద్యాల మున్సిపాలిటీ నుంచి వరద బాధితులకు లక్ష వాటర్ ప్యాకెట్లు అందిస్తున్నామన్నారు. పట్టణంలో సిబ్బంది కొరత ఏర్పడడంతో ప్రజలు సహకరించాలని సూచించారు. విజయవాడ వెళ్లిన వారిలో మున్సిపల్ ఇంజనీర్ రమణమూర్తి, డీఈఈలు మధుకుమార్, శ్రీనివాస రెడ్డి, జయభారతరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీ నారాయణ, శానిటరీ సెక్రటరీలు సిబ్బంది ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నంద్యాల(అర్బన్): ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ సుగుణశ్రీ సూచించారు. డ్రైడే, ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలోని కానాల, చాపిరేవుల, పాండురంగాపురం గ్రామాల్లో ఈఓఆర్‌డీ వెంకటేశ్వరరావుతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ డ్రైనేజీ కాల్వలో బ్లీచింగ్ పొడర్లు చల్లాలని సూచించారు. పరిశుభ్రత విషయంలో పంచాయతీ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అంకన్న, తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

ఆళ్లగడ్డ: ఇంటిస్థలం విషయంపై పట్టణంలో ఓ మహిళపై శుక్రవారం దాడి జరిగింది. ఎస్ఐ నగీన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తన స్థలంలో అక్రమంగా కట్టడం కట్టారని రవిచంద్రారెడ్డి జేసీబీతో తొలగించాడు. అయితే ఆ స్థలం తనదని, ఎందుకు గోడలు కూలుస్తున్నారని మంగమ్మ అనే మహిళ నిలదీయడంతో ఆమెపై కర్రతో దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

మహిళలతో సభ్యతగా ప్రవర్తించాలి

నంద్యాల(సిటీ): మహిళలతో సభ్యతగా ప్రవర్తించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక మహిళ పని ప్రదేశంలో ఆత్మ గౌరవంతో బతికేందుకు వేధింపులు లేని సమాజాన్ని నిర్మించాలన్నారు.

ఖురాన్ పఠనం అత్యుత్తమమైన ఆరాధన



మాట్లాడుతున్న హజ్రత్ మౌలానా ముఫ్తీ మాసుం సాఖిబ్ ఖాస్మీ

చాగలమర్రి: ఇస్లాం మతస్తులకు ఖురాన్ పఠనం అత్యుత్తమమైన ఆరాధనగా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బోధించారని రాయచోటి పట్టణానికి చెందిన ఇస్లాం మత గురువు హజ్రత్ మౌలానా ముఫ్తీ మాసుం సాఖిబ్ ఖాస్మీ అన్నారు. ఆయన శుక్రవారం కేజీఎస్ ఫంక్షన్ హాల్‌లో మదరసా- యే-అష్రపుల్ ఉలూం నిర్వాహకులు ఖలీల్ మౌలానా ఆధ్వర్యంలో నిర్వహించిన మదరసా (జల్సా) వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాఫీజ్-ఏ-ఖురాన్ పూర్తి చేసుకున్న విద్యార్థి మహమ్మద్ సోహెల్‌కు సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. అనంతరం హజ్రత్ మౌలానా ముఫ్తీ మాసుం సాఖిబ్ ఖాస్మీ మాట్లాడుతూ ముస్లింలందరూ ఖురాన్ పఠనానికి సమయాన్ని కేటాయించాలన్నారు. పిల్లలను ఖురాన్ పఠనాన్ని నేర్పించటానికి పెద్దలు ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి షేక్.బాబులాల్, ముఫ్తీ కరీముల్లా సాహెబ్, మౌలానా ముఫ్తీ సయ్యద్ సాహెబ్, మౌలానా ఆరీఫ్, మౌలానా సలాం, మౌలానా అబ్దుల్ సుబహాన్, మౌలానా మహబూబ్, హాఫీజ్ సులేమాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

గోస్పాడు: మండల కేంద్రం గోస్పాడులో సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్ కోరారు. శుక్రవారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, గిరిజన కాలనీల్లో పలుచోట్ల సీసీరోడ్లు, మురికి కాలువలు, వీధి దీపాలు లేక నిత్యం ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. వర్షాకాలంలో దోమల బెడద అధికమై ప్రజలు రోగాలబారిన పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై చెంచులకు అవగాహన

రుద్రవరం: మండల పరిధిలోని కోటకొండ మజరా చిన్నయ్యస్వామి చెంచుగూడెంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గూడెంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మీదేవి, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన ఆహారం, పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు ఎత్తు, బరువు, రక్త, వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే ఆ గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు.



కోతకు సిద్ధంగా మినుము పంట



డబ్బ్యా. గోవిందిన్నెలో కల్లాలోనే నిలిచిన పంట నూర్పిడి యంత్రాలు

వర్షం ఆగదు.. కోత సాగదు

- కోతకు వచ్చిన మినుము పంట
- వానలతో నిలిచిన పంటనూర్పిడి యంత్రాలు

డోర్నిపాడు: ఎడతెరిపి ఇవ్వకుండా పదిరోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు కుదేలవుతున్నారు. చేతికి వచ్చిన మినుము పంటను రైతులు ఇంటికి తెచ్చుకోలేనే పరిస్థితిలో ఉన్నారు. ఎక్కడ చూసిన పొలాల్లో వర్షపు నీరు నిల్వడంతో పంటకోతకు ఆటకంగా మారింది. కాసిన కాసిన్ని గింజలు వర్షానికి కాయలు పగిలి నేల రాలుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 741 హెక్టార్లలో మినుము సాగుచేశారు. తెలంగాణా, కోస్తా తదితర ప్రాంతాల నుంచి పంట నూర్పిడి యంత్రాలు సుమారు యాభైవరకు మండలానికి వచ్చాయి. వర్షానికి పనులు జరగక పోవడంతో ఎక్కడి యంత్రాలు అక్కడే కల్లాల్లో, పొలాల్లో వదిలేశారు. ఓ వైపు కోతలు కొనసాగగా రైతులు ఆందోళన చెందుతుండగా, మరో వైపు పంటనూర్పిడి యంత్రాలకు పనుల్లేక యజమానులు నష్టపోతున్నారు. గురువారం రాత్రి నుంచి మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో వర్షపు నీరు కుందూ, కుందర వాగులో కలవడంతో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నంద్యాల డివిజన్‌లో డోర్నిపాడు మండలంలోనే అత్యధికంగా 29.8మి.మీ వర్షపాతం నమోదు అయినట్లు తహసీల్దార్ సుభద్ర తెలిపారు. ఎక్కడ చూసిన పొలాల్లో నీరు ఎరులైపారుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



డబ్బ్యా. గోవిందిన్నె వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందరవాగు

ఆకతాయికి జైలుశిక్ష

నంద్యాల (వ్యవసాయం): దారిన వెళ్లే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న నిందితుడికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్ రెడ్డి శుక్రవారం జైలు శిక్షను విధించినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. దేవనగర్‌కు చెందిన నల్లగట్ల విజయ్‌కుమార్ పద్మావతి నగర్ మెయిన్ రోడ్డులో వెళ్తున్న మహిళ పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తుండటంతో స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రెండు రోజులు జైలు శిక్షను విధించినట్లు పోలీసులు తెలిపారు.

87 మందికి వైద్య పరీక్షలు

చాగలమర్రి: చిన్నవంగలిలో శుక్రవారం నిర్వహించిన 104 వైద్య శిబిరంలో సుమారు 87 మందికి రక్త, వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స చేసినట్లు ముత్యాలపాడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి తస్లీమాసుల్తానా తెలిపారు. సుమారు 28 మంది షుగర్, 42 మంది బీపీ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం నూర్జహాన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.